సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 26 । జనవరి । 2024



క్రీడల్లో రాణించాలి
ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు ఆటల్లో రాణించాలని మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.
IIలో ▸



పెద్ద పులి సంచారం
బుట్టాయగూడెం మండలం కోపల్లి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న పెద్ద పులి పరిసర ప్రాంత గిరిజనులను హడలెత్తిస్తోంది.
IIలో ▸



పట్టిసం ఏర్పాట్ల పరిశీలన
అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రం వద్ద జరిగే మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు.
IIలో ▸

న్యూస్‌రీల్

గణతంత్ర వేడుకలకు సిద్ధం



భీమవరంలో ముస్తాబైన వేదిక

భీమవరం: భారత గణతంత్ర దినోత్సవాలకు భీమవరం కలెక్టరేట్ ఆవరణలో భారీ ఏర్పాట్లు చేశారు. మూడు పెద్ద వేదికలతో పాటు మరో రెండు చిన్న వేదికలు, గ్యాలరీ, 14 స్టాల్స్, వివిధ శాఖలకు సంబంధించి 10 శకటాలను ఏర్పాటు చేశారు. ప్రొటోకాల్‌కు అనుగుణంగా సీటింగ్, స్టేజీ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌కు ఏర్పాట్లు చేశారు. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం, మాస్కులు, శానిటైజర్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు, అంబులెన్స్ సేవలు సిద్ధం చేశారు. గురువారం ఏర్పాట్లను కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. వేడుకలను ఘనంగా నిర్వహించేలా అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, అధికారులు ఉన్నారు.

సీఐలకు స్థానచలనం

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లాలో పలువురు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల (సీఐ)ను బదిలీ చేస్తూ ఎస్పీ యు.రవిప్రకాష్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలకొల్లు టౌన్ సీఐ డి.రాంబాబును ఏలూరు రేంజ్ వీఆర్‌కు పంపించగా ఆయన స్థానంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కె.నాగదేవిని సీఐగా నియమించారు. పెనుగొండ సీఐ దేశింశెట్టి వెంకటేశ్వరరావును డీసీఆర్‌బీకు పంపించగా ఆయన స్థానంలో కోనసీమ జిల్లాలో వీఆర్‌లో ఉన్న ఎన్.రజనీకుమార్‌ను సీఐగా నియమించారు.

బాల్య వివాహాలను అరికడదాం

ఏలూరు (టూటౌన్): సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు, వివక్షపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి కోరారు. స్థానిక గిరిజన్ భవన్‌లో భేటీ బచావో-భేటీ పడావో (ఆడపిల్లలను బతికిద్దాం-ఆడపిల్లలను చదివిద్దాం) వర్క్‌షాపును జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ దేశంలో బాలికల సంక్షేమం, వారి చదువుల కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఈ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చట్టవిరుద్ధమని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అవగాహన బోర్డులను ఆమె ఆవిష్కరించారు. ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కేవీఎస్ఎల్ పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డీఈఓ పి.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ కార్యవర్గం ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గురువారం స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి సత్రంలో నిర్వహించిన సంఘ ఎన్నికల్లో అధ్యక్షుడిగా చలువాది బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా మోటమర్రి సదానందకుమార్, మహిళా అధ్యక్షురాలిగా తవ్వ అరుణకుమారి ఎన్నికయ్యారు. ఉన్ని శ్రీనివాస్ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి సదానందకుమార్ మాట్లాడుతూ ఏలూరు అర్బన్ జిల్లా పరిధిలో ఆర్యవైశ్యులకు అన్నివేళలా అందుబాటులో ఉంటామన్నారు. తమ కమిటీ పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగిన అనంతరం ఆర్యవైశ్యుల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చెక్క రాజా, కార్యదర్శి పైడి భీమేశ్వరరావు, మద్దుల సత్యకుమార్, బొలిశెట్టి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అత్తిలిలో ఆసరా కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

ఆనందాల ఆసరా

రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత లక్ష్యంగా సీఎం జగన్ నిరంతరం శ్రమిస్తున్నారు. ఎన్నికలకు ముందు డ్వాక్రా మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ వరుసగా నాలుగో విడత వైఎస్సార్ ఆసరా నిధులను అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమచేస్తున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రజాప్రతినిధులు ఆసరా చెక్కులు అందిస్తుండగా.. లబ్ధిదారులు సీఎం జగన్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు.

– అత్తిలి/ఆగిరిపల్లి/మొగల్తూరు /ఉంగుటూరు

“ మహిళా స్వావలంబనే లక్ష్యం

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ మంత్రి

(అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..) ”



అత్తిలిలో ఆసరా చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి, ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు



కైకరంలో మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

“ మహిళలను వంచించిన బాబు

గత ప్రభుత్వంలో చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీకి హామీ ఇచ్చి మోసం చేస్తే.. డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని చెప్పి సీఎం జగన్ మాట నిలబెట్టుకున్నారు.

– పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎమ్మెల్యే

(కైకరంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..) ”



ఆగిరిపల్లిలో మహిళలకు చెక్కు అందిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

“ హామీలను నెరవేర్చిన సీఎం జగన్

డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నాలుగు దశల్లో పూర్తిగా డ్వాక్రా రుణమాఫీ చేస్తానని చెప్పిన మాటను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

– మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, నూజివీడు ఎమ్మెల్యే

(ఆగిరిపల్లి జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన ఆసరా కార్యక్రమంలో..) ”

ఆదాయం పెంచుకునేలా..



ఆసరా పథకంలో ఒక్కో విడతలో నాకు రూ.13 వేలు వచ్చాయి. ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన సాయంతో ఇంటి వద్ద జెరాక్స్ మెషీన్ పెట్టుకున్నారు. దీని ద్వారా కుటుంబ ఆదాయం పెంచుకుంటున్నా. ఇదంతా సీఎం జగన్ వల్లే సాధ్యం

– జలసూత్రం లక్ష్మీశ్రీ హరిత, వడ్లమాను

జగన్‌కు రుణపడి ఉంటాం



మా సంఘానికి రూ.6 లక్షల డ్వాక్రా రుణమాఫీ అయ్యింది. నాకు వచ్చిన మొత్తంతో 15 మేకలు కొన్నాను. నలుగురు అమ్మాయిల పెళ్లిళ్లు కూడా చేశాను. సీఎం జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను.

– దేవరకొండ అలివేలు, ఆగిరిపల్లి



పేరుపాలెంలో అక్కచెల్లెమ్మల్లకు ఆసరా చెక్కు అందిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

“ సాధికారతకు పెద్దపీట

రాష్ట్రంలో మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. రాబోయే రోజుల్లో మహిళలంతా ఆయనకే మద్దతు పలకాలి.

– ముదునూరి ప్రసాదరాజు, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్

(మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..) ”

30న ఎన్నికల సన్నాహక సభ

దెందులూరుకు సీఎం జగన్ రాక

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరులో ఈనెల 30న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల సన్నాహక సభ నిర్వహించనున్నారు. ఈ మేరకు బహిరంగ సభా స్థలం, హెలీప్యాడ్ ప్రాంతాలను గురువారం సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి లక్ష మంది వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారని, ఎటువంటి అసౌకర్యం లేకుండా వాహనాల పార్కింగ్, సభాస్థలి, ఇతర ఏర్పాట్లకు స్థలాలను పరిశీలిస్తున్నామన్నారు. ఎన్నికల శంఖారావం, సన్నాహక సభ ఇక్కడ నిర్వహించడం ఆనందంగా ఉందని, అందరి సహకారంతో సభ విజయవంతానికి కృషి చేస్తానన్నారు. ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్‌లు అప్పన ప్రసాద్, నెరుసు చిరంజీవులు, వైఎస్సార్ సీపీ నాయకులు మంచెం మైబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని, జిల్లా కమిటీ సభ్యులు పోకల రాంబాబు, కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, జెడ్పీ వైస్ చైర్మన్ పి.విజయ్‌బాబు, ఏలూరు డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కో-ఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్ ఉన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్

సీనియారిటీ జాబితా విడుదల

బుట్టాయగూడెం: కేఆర్‌పురం ఐటీడీఏ పరిధిలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఖాళీగా ఉన్న సహోపాధ్యాయ పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేసేందుకు ఎస్‌జీటీ ఉపాధ్యాయుల తాత్కాలిక సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు ఇన్‌చార్జి డీడీ పీవీఎస్ నాయుడు గురువారం ప్రకటనలో తెలిపారు. సహాయ గిరిజన సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, ఐటీడీఏ, పాఠశాలల్లోని నోటీసు బోర్డుల్లో జాబితాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. అభ్యంతరాలు ఉంటే ఈనెల 31లోపు తెలియజేయాలని కోరారు.

ఓటుహక్కును సక్రమంగా వినియోగించాలి

కలెక్టర్ ప్రశాంతి

భీమవరం: ఓటు హక్కు సక్రమ వినియోగంతో సుపరిపాలన సాధ్యమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం స్థానిక బీవీ రాజు కళాశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందడంతో పాటు, ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. భీమవరం ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు మాట్లాడుతూ ఓటు హక్కును స్వతంత్రంగా వినియోగించుకోవాలన్నారు. అత్యధిక సార్లు ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ సిటిజన్స్ ఎస్.కోటేశ్వరరావు, డి.సత్యనారాయణరాజు, గాతల జేమ్స్, ఎ.సత్యనారాయణ, జి.సత్యనారాయణరాజు, చెరుకువాడ రంగసాయిను కలెక్టర్ సత్కరించారు. బీవీ రాజు కళాశాల క్యాంపస్ అంబాసిడర్స్ మామిడిశెట్టి మహాలక్ష్మి, ఎం.శ్రీరాములు, గుడ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ ఐఆర్ కృష్ణంరాజు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ వై.దుర్గాకిషోర్, తహసీల్దార్ వై.రవికుమార్, ఎన్నికల డీటీ ఎం.సన్యాసిరావు, డీఈఓ ఆర్.వెంకటరమణ పాల్గొన్నారు.



ఓటర్ల దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్

రూ. 8.80 లక్షలు స్వాధీనం

పెనమలూరు: మండల పరిధిలోని కానూరు వద్ద కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి వద్ద పోలీసులు రూ.8.80 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు కథనం మేరకు.. కానూరు 100 అడుగుల రోడ్డులో పోలీసులు బుధవారం రాత్రి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఉంగుటూరు మండలం వెలమిల్లికి చెందిన వ్యాపారి వాకచర్ల వెంకటేశ్వరరావు ప్రయాణిస్తున్న కారులో రూ.8.80 లక్షలను గుర్తించారు. ఆ నగదుకు సంబంధించిన పత్రాలను అతను పోలీసులకు చూపలేదు. దీంతో పోలీసులు ఆ సొమ్మును స్వాధీనం చేసుకుని గురువారం కేసు నమోదు చేశారు.

నేత్రపర్వంగా మల్లికార్జున కల్యాణం

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ శాఖ నిర్వహణలో ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక బలుసులమ్మవారి ఆలయ ప్రాంగణంలో ధర్మ ప్రచార మహోత్సవాల్లో భాగంగా గురువారం భ్రమరాంబ, మల్లికార్జునస్వామి దివ్య కల్యాణోత్సవం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణం జరిపించారు. వందలాది మంది భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు. శ్రీశైలం దేవస్థానం వేద పండితులు, అర్చకులు కల్యాణ తంతు జరిపించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

వేల్పూరు పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

భీమవరం (ప్రకాశంచౌక్)/తణుకు టౌన్: తణుకు మండలం వేల్పూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-1 వి.గంగాధర్‌రావును కలెక్టర్ పి.ప్రశాంతి సస్పెండ్ చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.17.90 లక్షలు సొంత ఖాతాకు మళ్లించుకున్న అభియోగంపై చేసిన ప్రాథమిక విచారణలో రుజువైన కారణంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గంగాధర్ రూ.17.90 లక్షల నిధులను విధివిధానాలు పాటించకుండా వారి కార్యాలయం స్వీపర్ అకౌంటుకు తొలుత మళ్లించి, తిరిగి అతని సొంత ఖాతాలో అదే మొత్తాన్ని జమ చేయించుకున్నారు. ఈ విషయమై పంచాయతీ సర్పంచ్ ఫిర్యాదు చేయగా నరసాపురం డివిజనల్ పంచాయతీ అధికారితో విచారణ జరిపి ప్రాథమిక నిర్ధారణ మేరకు విధుల నుంచి సస్పెండ్ చేసి, పూర్తి విచారణకు కలెక్టర్ ఉత్తర్వులను జారీ చేశారు.

భారీగా తెలంగాణ మద్యం పట్టివేత


కట్కూరులో పట్టుబడిన తెలంగాణ మద్యం

వేలేరుపాడు : కట్కూరులో ఓ షాపులో విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న తెలంగాణ మద్యాన్ని గురువారం పోలీసులు పట్టివేశారు. వివరాలిలా ఉన్నాయి. కట్కూరు గ్రామంలో ముత్తబోయిన రాంబాబు అనే వ్యక్తి తన కిరాణా షాపులో తెలంగాణ రాష్ట్రం నుంచి తీసుకువచ్చిన మద్యాన్ని విక్రయిస్తున్నాడు. దీనిపై తమకు అందిన సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో షాపులో ఉన్న రూ.24,480 విలువ చేసే 144 మాన్షన్ హౌస్ బ్రాందీ బాటిళ్లు, రూ.15,600 విలువ చేసే 120 ఓల్డ్ అడ్మిరల్ బ్రాందీ బాటిళ్లు, రూ.59,360 విలువ చేసే 371 నాక్ అవుట్ బీర్ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రాంబాబును అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఈ దాడిలో కుక్కునూరు సీఐ వి.శ్రీనివాసరావు, వేలేరుపాడు ఎస్సై లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు, షీల్డ్‌ల అందజేత


ఖోఖో విజేత మహిళా జట్టుకు షీల్డ్ అందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ


క్రికెట్‌లో విజేత జట్టుకు బహుమతి షీల్డ్ అందిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను స్ఫూర్తిగా తీసుకుని క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రి కొట్టు సత్యనారాయణ అభిలషించారు. ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను, షీల్డుల ప్రదాన కార్యక్రమాన్ని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ దేశానికే ఆదర్శంగా నిలిచేలా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వినూత్న కార్యక్రమాలను నిర్వహించి నంబర్ వన్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. దేశంలో ఇతర రాష్ట్రాల నాయకులు సీఎం వైఎస్ జగన్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారన్నారు. పరిపాలనలో నూతన ఒరవడికి నాంది పలికారన్నారు. పరిపాలన విధానాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఒక్కరే అన్నారు. విద్యార్థులు, యువత విద్యతోపాటు క్రీడల్లో మేటిగా నిలవాలనే సంకల్పంతోనే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. దీనివలన యువత శారీరకంగా, మానసికంగా దారుఢ్యంగా తయారవుతారన్నారు. భవిష్యత్తులో ఎటువంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనా వాటిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యంతో ముందుకు సాగుతారన్నారు. పరిపాలన విషయంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలవాలనే లక్ష్యంతోనే జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. క్రీడల్లో మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలపాలనే ఆలోచనతో కోట్లాది రూపాయలు వెచ్చించి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించారన్నారు. దీనిని ప్రతి సంవత్సరం నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తారని చెప్పారు. క్రీడాకారులకు అనువుగా ఉండేందుకు తాడేపల్లిగూడెంలో 12 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం నిర్మించనున్నట్లు మంత్రి కొట్టు చెప్పారు. ఈ స్టేడియంలో క్రికెట్‌తోపాటు వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ తదితర క్రీడలు ఆడేలా తీర్చిదిద్దుతామన్నారు. ఈ స్టేడియం నిర్మాణానికి శంకుస్థాపన ముఖ్యమంత్రి చేతుల మీదుగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు క్రీడా నైపుణ్యాన్ని పెంచుకుని వచ్చే సంవత్సరం నిర్వహించే పోటీలో మరింత ఉన్నతంగా రాణించాలన్నారు. క్రీడలతోపాటు చదువుకు ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. ఉన్నత విద్యను అభ్యసించిన తరువాత క్రీడా విభాగంలో ఉద్యోగాలు పొందవచ్చునన్నారు. ఈ క్రీడలను పరిశీలించిన వ్యాయామ ఉపాధ్యాయులు, మంచి నైపుణ్యం కనబరిచిన క్రీడాకారులను గుర్తించి వారితో ఆయా క్రీడలకు సంబంధించి టీమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విజేతలకు మెమెంటోలు, మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చెన్నయ్య, డీఎస్పీ భరత్‌రాజ్‌కుమార్, స్పోర్ట్ అథారిటీ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మి, కర్రి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టిసం ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన


పట్టిసం రేవులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో కె.అద్దయ్య

పోలవరం రూరల్: అఖండ గోదావరి నది మధ్య గల పట్టిసం శివక్షేత్రం వద్ద జరిగే మహాశివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను జంగారెడ్డిగూడెం ఆర్డీవో, ఉత్సవ కమిటీ చైర్మన్ కె.అద్దయ్య గురువారం పరిశీలించారు. భక్తులు నది దాటేందుకు వీలుగా పంట్లు ఏర్పాటుచేసే ప్రాంతాన్ని పరిశీలించారు. గోదావరినీటి మట్టం ఎంత వరకు తగ్గుతుంది అనే పరిస్థితులను కూడా ఆయన అధికారుల నుంచి తెలుసుకున్నారు. భక్తులు క్షేత్రానికి వెళ్లేందుకు వీలుగా పక్కాగా నదిలో ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈయన వెంట ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ బీఎల్‌ఓగా వీఆర్వో భాస్కర్



గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీఆర్వో భాస్కర్

ఉంగుటూరు: రాష్ట్ర ఉత్తమ బూత్ లెవిల్ అధికారిగా ఎ.గోకవరం వీఆర్వో భాస్కర్ గురువారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా మెమెంటో, సర్టిఫికెట్ అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా సర్టిఫికెట్‌తో పాటు రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. భాస్కర్ ఎ.గోకవరంలోని పీఎస్ నంబర్ 9లో పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా భాస్కర్‌ని పలువురు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాళ్ల : సీసలి పంటకాలవలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు కాళ్ళ పోలీసులు గురువారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఉదయం సీసలి పంటకాలువలో మృతదేహం కొట్టుకొచ్చినట్లు సీసలి వీఆర్వో జి.చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జె.శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లి పాడైన స్థితిలో ఉందని, సుమారు 55 సంవత్సరాల వయస్సు ఉండవచ్చని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.


విద్యుత్ సంస్థలో ఏలూరు సర్కిల్‌కు అవార్డులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ సంస్థ పరిధిలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన చేసిన వారికి రిపబ్లిక్ డే సందర్భంగా ప్రదానం చేసే అవార్డులకు ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని పలు విభాగాలు, పలువురు అధికారులు ఎంపికయ్యారు. ఉత్తమ ఆపరేషన్ సెక్షన్‌గా పెదపాడు, ఉత్తమ ఆపరేషన్ సబ్ డివిజన్‌గా కొవ్వూరు, ఉత్తమ విద్యుత్ రెవెన్యూ కార్యాలయంగా పాలకొల్లు, ఉత్తమ కన్‌స్ట్రక్షన్ డివిజన్‌గా ఎంపికయ్యాయి. అలాగే ఉత్తమ ఉద్యోగులుగా వీరవాసరం ఏఈ కె.రవికుమార్ వర్మ, బుట్టాయగూడెం సెక్షన్ రాజానగరం జూనియర్ లైన్‌మెన్ పి.రాజు, విజిలెన్స్ విభాగానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ కె.రాజా రమేష్ కుమార్ ఎంపికయ్యారు. వీరికి శుక్రవారం విశాఖపట్నంలో నిర్వహించే రిపబ్లిక్ డే ఉత్సవాల్లో సంస్థ సీఎండీ పృధ్వీతేజ్ ఇమ్మడి చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి


కుక్కునూరు: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. బంజరగూడెం గ్రామంలో జెమిలీ రాము (35) గురువారం ఉదయం బహిర్భూమి కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడ్డాడు. అటుగా వెళ్తున్న వారు గమనించి బాధితుడిని బయటకు తీసే సమయానికి చెరువులో మునిగి ఊపిరాడక మృతి చెందాడు. ఈ విషయమై కుటుంబసభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్టు


బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

పోలవరం రూరల్: సరిపల్లి కుంట అటవీప్రాంతంలో సారా బట్టీలపై పోలవరం పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో చేసిన ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు


షెడ్డును బస్సు ఢీకొన్న దృశ్యం

పెదపాడు : స్కూల్ బస్సుకు సైకిలిస్ట్ అడ్డురావడంతో రహదారి పక్కనే ఉన్న ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన పెదపాడు మండలం వసంతవాడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం వసంతవాడ నుంచి పంచాయతీ కార్యాలయం వైపునకు వెళుతున్న ఓ ప్రైవేటు స్కూల్ బస్సును అడ్డుగా వచ్చిన ఓ సైకిలిస్టును తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించడంతో అదుపు తప్పింది. రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఫణి నివాసంలోకి దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ఇద్దరు చిన్నారులకు స్వల్ప గాయాలైనట్టు స్థానికులు తెలిపారు.

స్థలదాతకు ఘన సన్మానం


పెనుమర్రులో సచివాలయ భూమి స్థల దాత పాత్తూరి సోమరాజును సన్మానిస్తున్న గుడాల శ్రీహరి, చీఫ్ విప్ ముదునూరి

యలమంచిలి: ప్రభుత్వ భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలు లేని గ్రామాలలో భవనాల నిర్మాణం ప్రారంభం కావడం లేదు. గ్రామాలలో సైతం భూముల ధరలు కొండెక్కడంతో ప్రభుత్వ నిధులతో భూమి కొని భవనాలు నిర్మించే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో పెనుమర్రు గ్రామంలో గ్రామ సచివాలయ నిర్మాణానికి అనువైన స్థలం లేకపోవడంతో భవన నిర్మాణం ముందుకు సాగలేదు. సమస్య తెలుసుకున్న గ్రామానికి చెందిన పాత్తూరి సోమరాజు రూ.20 లక్షలు విలువైన ఆరు సెంట్ల స్థలాన్ని ఉచితంగా ఇవ్వడానికి ముందుకు వచ్చి స్థలం ఇచ్చారు. దీంతో ఆ స్థలంలో గ్రామ సచివాలయ భవనం నిర్మించి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థలదాత పాత్తూరి సోమరాజును వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కలిసి ఘనంగా సన్మానించారు. ఇటువంటి దాతలు ఉన్న గ్రామం ఎప్పటికీ అభివృద్ధి పథంలోనే నడుస్తుందని వారు కితాబిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ, సర్పంచ్ కవురు గోపి, ఎంపీటీసీ కవురు నాగలక్ష్మి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పాకా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

మొగల్తూరు: జాతీయ రహదారిపై సీతారాంపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మొగల్తూరు పంచాయతీ కుక్కలవారితోటకు చెందిన జోగి క్రాంతి (18) మోటార్ సైకిల్‌పై గురువారం రాత్రి నరసాపురం నుంచి మొగల్తూరు వస్తున్నాడు. సీతారాంపురం స్వర్ణాంధ్ర కళాశాలకు వెళ్లే మలుపు వద్దకు వచ్చేసరికి మొగల్తూరు వైపు నుంచి వస్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో క్రాంతి అదుపు తప్పి లారీ వెనుక వైపు చక్రాల కింద పడటంతో తలకు బలమైన గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుని తండ్రి మురళీకృష్ణ నరసాపురం నరసాపురం ఆర్టీసీ గ్యారేజీలో మెకానిక్‌గా విధులు నిర్వహిస్తున్నారు. కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మొగల్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌తో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని..

యలమంచిలి: అండమాన్‌కు చెందిన ఆకుమర్తి సోను (29) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మరణించినట్లు ఎస్సై కాకి శివనారాయణ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం అండమాన్‌లో నివాసం ఉండే సోను సంక్రాంతి పండుగ కోసం 20 రోజుల క్రితం ఇలపకుర్రు పంచాయతీ కుమ్మరపాలెంలో ఉన్న మేనమామ సిర్రా లాజరు ఇంటికి వచ్చాడు. ఇదిలా ఉండగా బుధవారం సాయంత్రం తెలిసినవారి బైక్ తీసుకుని పాలకొలు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. కట్టుపాలెం వినాయకుని గుడి సమీపంలోకి వచ్చేసరికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన అతనిని స్థానికులు 108 వాహనంలో పాలకొల్లు తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం భీమవరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మేనమామ లాజరు కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

హడలెత్తిస్తున్న పెద్దపులి సంచారం

- రెడ్డికోపల్లిలో ఎద్దు కళేబరాన్ని పరిశీలించిన అటవీ అధికారులు
- కోపల్లి బీట్ పరిధిలో సంచరిస్తోంది పెద్దపులే అని నిర్ధారణ
- యర్రాయిగూడెంలో సంచరిస్తున్నది చిరుతపులిగా గుర్తింపు


రెడ్డికోపల్లి బీట్ పరిధిలో పులి సంచర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు


రెడ్డికోపల్లి బీట్ పరిధిలో పులి పాదముద్రలు

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం మారుమూల గ్రామమైన కోపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో సంచరిస్తున్న పెద్దపులి పరిసర ప్రాంత గిరిజనులను హడలెత్తిస్తోంది. బుధవారం రాత్రి పులి గాండ్రింపులు వినిపించాయని ముంజులూరు, రెడ్డికోపల్లి, వీరన్నపాలెం గ్రామానికి చెందిన గిరిజనులు చెబుతున్నారు. అలాగే ఆయా గ్రామాల మధ్యలో ఉన్న కాల్వ ఒడ్డున పులి పాదముద్రలను స్పష్టంగా చూశామని గిరిజనులు అంటున్నారు. ఇదిలా ఉండగా పులిదాడిలో ఎద్దు మృతి చెందిన ప్రదేశాన్ని ఫారెస్ట్ అధికారులు పరిశీలించారు. అలాగే మృతి చెందిన ఎద్దు ప్రదేశం నుంచి సుమారు కిలోమీటర్ పొడవునా నాలుగువైపులా పులి సంచరించిన ప్రదేశాన్ని గుర్తించారు. జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ సబ్ డీఎఫ్‌ఓ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఫారెస్ట్, వైల్డ్‌లైఫ్ అధికారులు అటవీప్రాంతంలోని పలు ప్రదేశాల్లో పాదముద్రలను గుర్తించి అవి పులివేనని ధ్రువీకరించారు. పులిరామన్నగూడెం, రెడ్డికోపల్లి, వీరన్నపాలెం గ్రామాల పరిసర ప్రాంతాల్లో పులి తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని ప్రజలు రాత్రివేళల్లో జాగ్రత్తగా ఉండాలని, ఎవ్వరూ బయట తిరగవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. ఇదిలా ఉండగా మండలంలోని ఎర్రాయిగూడెం సమీపంలో సేకరించిన పాదముద్రలు ల్యాబ్‌కు పంపించామని అవి చిరుతపులివిగా గుర్తించామని అన్నారు. అయితే గురువారం నల్లజర్ల, చీపురుగూడెం సమీపంలో ఉన్న అటవీప్రాంతంలో రోడ్డుమీద చిరుతపులి సంచరించడం ఆటో డ్రైవర్ చూసినట్లు తమకు సమాచారం అందిందని వైల్డ్ లైఫ్ అధికారి ప్రభాకర్ తెలిపారు. ఇదిలా ఉండగా పులి ఆచూకీ కోసం అధికారులు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యం కావాలి

- పుట్టింటికి వచ్చిన ఆనందం వనితమ్మలో కనిపిస్తోంది
- సమీకరణలో భాగంగానే వనిత, తలారీల స్థానాల మార్పు
- వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

ద్వారకాతిరుమల: పుట్టింటికి వచ్చిన ఆనందం వనితమ్మలో కనిపిస్తోందని, ప్రజలు ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో ఆమెను అఖండ మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ద్వారకాతిరుమలలో గురువారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ గోపాలపురం నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశం, రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణా శాఖ మంత్రి తానేటి వనిత నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతల స్వీకరణ మహోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే గోపాలపురం, రాజానగరం ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, జక్కంపూడి రాజా, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, గోపాలపురం నియోజకవర్గ పరిశీలకులు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి, మంత్రి వనిత, ఎమ్మెల్యే తలారిలను పార్టీ నేతలు గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సభలో మిథున్‌రెడ్డి మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం సొంత నియోజకవర్గం కావడమే వనితమ్మ ధైర్యానికి కారణమని, ఆ ధైర్యమే ఆమె గెలుపుకు నాంది పలుకుతుందన్నారు. సమీకరణాలు, పార్టీ నిర్ణయంలో భాగంగానే వనితను గోపాలపురానికి, తలారిని కొవ్వూరుకు పంపడం జరిగిందన్నారు. నియోజకవర్గం మారడం కొద్దిగా కష్టమైనా ఎంతో పెద్ద మనస్సుతో వీరిద్దరూ ఒప్పుకుని, పోటీ చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నా, గత ఐదేళ్లుగా జరిగిన మంచి కార్యక్రమాలన్నీ కొనసాగాలన్నా విభేదాలను పక్కనబెట్టి కలసికట్టుగా పార్టీ గెలుపుకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ప్రతి ఒక్కరూ గత చంద్రబాబు పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని గమనించాలన్నారు. చంద్రబాబు డ్వాక్రా, బంగారు రుణాలు మాఫీ చేస్తానని నమ్మించి మోసం చేశారన్నారు. కానీ జగనన్న ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారన్నారు. అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, విద్యా దీవెన, వసతి దీవెన వంటి ఎన్నో పథకాల ద్వారా పేదలకు మేలు చేసిన ఘనత జగనన్నదే అన్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన పార్టీ నేతలను ఆయన అభినందించారు.

క్లుప్తంగా

సోషల్ మీడియా కార్డుల పంపిణీ


సోషల్ మీడియా కార్డులను అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: నూతనంగా వచ్చిన సోషల్ మీడియా కార్డులను ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియా సిబ్బంది కష్టపడి పనిచేయాలన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకొనేందుకు కృషి చేయాలన్నారు.

చింతామణిదేవికి ప్రత్యేక పూజలు


గంగా హారతి ఇస్తున్న మహిళలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుష్యపౌర్ణమి పురస్కరించుకుని స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో గురువారం ఉదయం చింతామణి దేవి అమ్మవారికి, గురుపాదకులకు పంచామృతాలతో అభిషేకాలు, సహస్ర నామార్చనలు జరిగాయి. మహిళా భక్తులచే లలితా సహస్రనామాలు, అష్టలక్ష్మి స్తోత్రం, కనకధారా స్తోత్రం పారాయణలు నిర్వహించారు. రాత్రి గంగా హారతి సమర్పించారు. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు విజ్ఞప్తి చేశారు. పెన్షనర్స్ న్యాయపరమైన కోర్కెలను అమోదించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం విశ్రాంత ఉద్యోగులచే 3 గంటల పాటు నిరసన కార్యక్రమం జరిగింది. వక్తలు మాట్లాడుతూ ప్రతి నెలా 1వ తేదీన పెన్షన్లు చెల్లించాలని, తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను పునర్ధురణ చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు, ఎరియర్స్ బకాయిలు చెల్లించాలని, హెల్త్ కార్డులు ద్వారా అన్ని వ్యాధులకు గుర్తింపు పొందిన ఆస్పత్రిల్లో వైద్య సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వీకే వీరారావు, దాసం నాగేశ్వరరావు, గరికపాటి సుబ్రహ్మణ్యం శర్మ, ఎండీ ముస్తాఫా, పి.విశ్వంరాజు, ఓ.కృష్ణకుమారి, కె.రామలక్ష్మి, వి.రామోహన్‌రావు, గాజుల మురళీకృష్ణ, దాసం వెంకట రమణ, పి.నాగరాజు, పెన్షనర్స్ పాల్గొన్నారు.

కొట్టును కలిసిన టౌన్ సీఐ


ఉపముఖ్యమంత్రి కొట్టుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెం పట్టణానికి బదిలీపై వచ్చిన సీఐ ఎ సుబ్రహ్మణ్యం, గురువారం ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కొట్టు మాట్లాడుతూ నియోజవకర్గంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

నిర్ణీత ఫార్మాట్‌లో నవరత్నాలు


సమావేశంలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది, తదితరులు

తాడేపల్లిగూడెం రూరల్: నిర్ణీత ఫార్మాట్‌లో నవరత్నాలు – అందరికీ ఇళ్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని రిజిస్ట్రార్ వీవీవీ.సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సచివాలయ సెక్రటరీలు, వార్డు సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లకు రిజిస్ట్రేషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వీవీవీ.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 27వ తేది నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ఫిబ్రవరి 9వ తేదిలోగా పూర్తి చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలోని 15 అంశాల గురించి వరుస క్రమంలో వివరించారు. వార్డు సెక్రటరీ, వీఆర్వోలు వారి పరిధిలోని లబ్ధిదారుల నుంచి ప్లాట్ నెంబరు తదితర వివరాలతో పాటు ఇరువురు సాక్షులు ముందుగా సిద్ధం చేసుకోవాలన్నారు. తద్వారా రిజిస్ట్రేషన్ సమయంలో సులభతరంగా ప్రక్రియ ముందుకు సాగుతుందన్నారు. వీఆర్వోలు కే.రాంబాబు, జేఎస్ వీ.స్వామి నాయుడు, వైవీ.మంగరాజు, డి.దేవరాజు, కే.లలిత, వార్డు సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం

రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు


అత్తిలిలో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అవినీతికి తావులేకుండా ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం అత్తిలి శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మండపం వద్ద నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు నాలుగు విడతల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణమాఫీ చేశారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలు ఆగకుండా ప్రజలకు అందించామన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు కల్లబొల్లి హామీలు ఇచ్చి డ్వాక్రా మహిళలను మోసం చేస్తే, నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అదే మహిళలకు నాలుగు విడతల్లో రుణమాఫీ చేసి వారిని ఆర్థికంగా ఆదుకున్నారని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. నాల్గవ విడత ఆసరా కార్యక్రమం ద్వారా అత్తిలి మండలంలోగల 1,355 స్వయం సహాయక సంఘాలకు రూ. 13,74,37,605లు రుణమాఫీ జరిగిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సీఎం తీసుకు వచ్చిన విప్లవాత్మకమైన మార్పులకు మన రాష్ట్రం విద్యారంగంలో ప్రథమస్థానానికి ఎగబాకిందని, పేదరికం తగ్గిందని చెప్పారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి సీఎంగా గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ఈ ప్రభుత్వంపై పచ్చమీడియా, ప్రతిపక్షపార్టీలు ఏకమై అసత్యప్రచారాలు చేస్తున్నాయని, వాటిని ప్రజలు నమ్మవద్దన్నారు. మీఇళ్లకు రెండు కండువాలు కప్పుకుని ఓట్లు అడగడానివస్తుంటారని, వారికి ఓటీపీలు చెప్పవద్దని తెలిపారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధి సాధించమే లక్ష్యంగా సీఎం సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశంలో ఏరాష్ట్రంలో కూడా అమలు జరగడంలేదన్నారు. మంచి చేస్తున్న ఈప్రభుత్వానికి మీ చల్లని ఆశీస్సులు అందించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ గంటావిజేత నాగరాజు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, అత్తిలి, తణుకు టౌన్ మహిళా విభాగం అధ్యక్షురాలు కాకర్ల విశాలాక్షి, నూకల కనకదుర్గ, రాష్ట్రమైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, వైస్ ఎంపీపీ దారం శిరీషా, అత్తిలి టౌన్ అధ్యక్షుడు పోలినాటి చంద్రరావు, మండలపార్టీ నాయకులు గంటా నాగరాజు, తమ్మాబత్తుల రాము, రంభ సూరిబాబు, రామిశెట్టి రాము, సబ్బితి రాజేష్, ఆకుల పండుస్వామి, శింగంశెట్టి శ్రీనివాస్, ఆకుల చినబాబు, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు, ఎంపీడీఓ అమీలుజమా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్, వంగవీటి మోహనరంగా విగ్రహాల ఆవిష్కరణ


అత్తిలిలో వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

అత్తిలి: కులమతాలకు అతీతంగా పేద ప్రజల అభ్యున్నతికి అహర్నిశలు పాటుపడి మహనీయులైన స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి, స్వర్గీయ వంగవీటి మోహనరంగా విగ్రహాలను ఒకేచోట నెలకొల్పడం చాలా ఆనందంగా ఉందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి సంతమార్కెట్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా విగ్రహాలను గురువారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుతో కలిసి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి, వంగవీటి మోహనరంగా లేని లోటు ప్రజలకు తీరనిదన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా కాపుల నాయకుడు కాదని, బడుగు, అణగారిన వర్గాల నాయకుడని తెలిపారు. సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమౌతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాడు అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు.

అభివృద్ధి పనులపై ఆరా


10 వార్డులో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శామ్యూల్, కర్రి భాస్కరరావు

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలోని 10వ వార్డులో మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు వీధులను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోమహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో పెనుగొండ ఆంజనేయులు, అల ధనకొండ, చామన ప్రసాద్, ఆరిమిల్లి రవి, కోడే శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగన్నాథపురం హజరత్ కాలే మస్తాన్ షా ఔలియా (దర్గా)లో ఈ నెల 26, 27, 28వ తేదిల్లో ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నట్టు దర్గా పోషకురాలు అబ్బిన నాగమణి తెలిపారు. గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. 26న తెల్లవారు జామున ఘుమ్మస్‌పై సందల్ (గంధం) పూయుట, 27న సాయంత్రం 4.30 గంటలకు గుర్రంపై సందల్ ఊరేగింపు, 28న దీపాల మహోత్సవం, విద్యార్థులకు బహుమతుల అందజేస్తారన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సాక్ష్యం

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- పేకేరులో ప్రజాదీవెన యాత్ర ప్రారంభం


పేకేరు ప్రజా దీవెన యాత్రలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే ఉత్తమ పాలనకు సాక్ష్యమని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఇరగవరం మండలంలోని పేకేరు, నిట్లవారి తోట, ఏలేటిపాడు, అయితంపూడి గ్రామాల్లో గడపగడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజా దీవెన యాత్ర సాగింది. పాదయాత్రలో దారి పొడవునా మంత్రికి ఘన స్వాగతం లభించింది. తామంతా మీ వెంటే ఉంటామని, తిరిగి జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని మహిళలు మంత్రికి ముక్తకంఠంతో తెలిపారు. ప్రతి ఒక్కరిని పలుకరిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వలంటీర్ వ్యవస్థ ద్వారా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తెలిపిన సమస్యలు విని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పేకేరు గ్రామంలో 48.6 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, పేకేరు నుండి ఖండవల్లి, రాపాకా నుంచి నిట్లవారి తోట వెళ్లే బీటీ రోడ్లను, విలేజ్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. రెండు కండువాలతో దొంగలు వస్తున్నారు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. సీఎం జగన్ నిరంతరం ప్రజల గురించి ఆలోచిస్తూ ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మెన్ గుబ్బల తమ్మయ్య , తణుకు నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి సత్య రాజేంద్ర ప్రసాద్, ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెనుమత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి, సర్పంచ్‌లు బెల్లంకొండ హేమ కుమారి, గుడాల లక్ష్మి, బెల్లంకొండ సురేష్, ఎంపీడీవో ఎ శ్రీనివాస్ కార్యదర్శులు ఫణీంద్ర, లక్ష్మీ నారాయణ, ఏపీపీ వెలగల సాయిబాబా రెడ్డి , ద్వారం పూడి చంద్ర శేఖర్ రెడ్డి, చింతా బాపి రెడ్డి, ఏలేటిపాడు సొసైటి అధ్యక్షులు సత్తి సత్తిబాబు , కొప్పూరి శ్రీనివాస రెడ్డి, చోడే ఏసు రత్నం చోడే జోషి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, కారుమూరి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

27న వీరవాసరంలో ఆక్వా రైతుల సమావేశం

భీమవరం: ఈనెల 27వ తేదీన వీరవాసరంలోని తులసీ కన్వెన్షన్ హాల్లో రొయ్యల పంట బీమాపై రైతులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు రొయ్యల రైతుల సంక్షేమ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు చెప్పారు.

సేఫ్‌కేర్ సెంటర్‌లో పోషకాహారం పంపిణీ


హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారం అందజేస్తున్న డాక్టర్ మురళీకష్ణ, తదితరులు

తణుకు అర్బన్: హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పోషకాహారం, నిత్యావసర సరుకులు అందచేయడం అభినందనీయమని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ అన్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఆవరణలోని సేఫ్ కేర్ సెంటర్‌లో మందులు వాడుతున్న హెచ్ఐవీ బాధిత చిన్నారులకు తణుకు ఇషా హాస్పిటల్ అధినేత డాక్టర్ మురళీకృష్ణ సౌజన్యంతో పోషకాహారాన్ని గురువారం చిన్నారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజికసేవా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మురళీకృష్ణ చేస్తున్న సాయం స్ఫూర్తిదాయకమన్నారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ బాధిత చిన్నారుల సౌకర్యార్థం ఒక ఏడాదిపాటు ప్రతినెలా పోషకాహారం ఇవ్వాల్సిందిగా వైద్యాధికారి అడిగిన వెంటనే ఇస్తానని చెప్పానని అదేవిధంగా ఇస్తున్నట్లు చెప్పా రు. సేఫ్ కేర్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ పుప్పాల రాజరాజేశ్వరి, సేఫ్‌కేర్ సెంటర్ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం


తాడేపల్లిగూడెం(టీఓసీ): పట్టణంలో విద్యార్థులతో మానవహారం చేస్తున్న దృశ్యం


తణుకు: ఓటరు దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేస్తున్న అధికారులు, ఓటర్లు, సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పై అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ కె.చెన్నయ్య అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నుంచి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జూనియర్ కళాశాల విద్యార్థులు, వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. తాలుకా ఆఫీస్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. అనంతరం జరిగిన సభ కార్యక్రమంలో ఆర్డీవో చెన్నయ్య మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గేష్, తహసీల్దార్ శివశంకర్, ఎంపీడీఓ విశ్వనాథ్, అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, ఎంఈఓ హనుమ, ఏఓ నరసింహరావు, ఐకేపీ ఏపీఎం లక్ష్మి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు సద్వినియోగం ద్వారానే మంచి పాలన

తణుకు టౌన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు విలువ ఎంతో ముఖ్యమైనదని తణుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీవీ రమణ తెలిపారు. గురువారం తణుకులో ఓటరు దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీ రమణ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఓటు నమోదు అధికారి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, తణుకు తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఇరగవరం, అత్తిలి తహసీల్దార్‌లు, ఎంపీడీలు తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు ఎస్సైగా మోహనరావు

పెంటపాడు: పెంటపాడు నూతన ఎస్సైగా జి. మోహనరావు నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన ఎస్సై హరికృష్ణ నర్సాపురం ప్రాంతం బదిలీపై వెళ్లగా భీమవరంలో పనిచేస్తున్న ఎస్సై మోహనరావు పెంటపాడు నూతన ఎస్సైగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.